భూముల రీసర్వేకు బ్రేక్..!

రీసర్వే డిటిలకు ఎన్నికల విధులు అప్పగింత గ్రామాలలో ఆగిపోయిన రీసర్వే పనులు

జామిలో రీసర్వే జరగని భూములు

విశాలాంధ్ర-జామి: ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియకు బ్రేక్ పడింది. నిన్నటి వరకు ఊపిరి సలపని విదంగా రెవెన్యూ సిబ్బంది రీసర్వేను చేపట్టారు. ఎన్నికలనిభందనల మేరకు జిల్లాలో తహశీల్దార్‌ల బదిలీలు జరిగాయి. దీంతో కొద్దిరోజులుగా సర్వేపనులు దాదాపు ఆగిపోయాయి. ఇప్పుడుఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రీసర్వేను పూర్తిగా ఆపివేస్తున్నట్లుగా తెలిసింది. రీసర్వే నిమిత్తం రాష్ట్రప్రభుత్వం ప్రతీ మండలానికి ఒక రీసర్వే డిటిలను ప్రత్యేకంగా నియమించింది. సదరు రీసర్వే డిటి మండలంలోని భూముల సర్వే పనులను రోజువారీగా పరిశీలన చేస్తున్నారు. ఇప్పుడు రీసర్వే డిటిలను ఎన్నికలవిధులకు ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారు. దీంతో గ్రామాలలో రీసర్వే పూర్తిగా ఆగినట్లుగా తెలుస్తోంది.

మండలంలో మిగిలిపోయిన 6 రెవెన్యూగ్రామాలు

రీసర్వేలో భాగంగా మండలంలోని 28 రెవెన్యూ గ్రామాలలో రీసర్వే చేయాలని అధికారులు, సిబ్బంది భావించారు. కానీ పెద్ద రెవెన్యూ గ్రామాలు ఎక్కువ రోజులు సమయం పడుతుందనే కారణంతో చిన్న గ్రామాలను సర్వే ప్రారంభించి దాదాపు పూర్తి చేసారు. ఈనేపధ్యంలో మండలంలోని జామి, భీమసింగి, అలమండ, రామభద్రపురం, తాండ్రంగి, అన్నంరాజుపేట వంటి గ్రామాలలో కనీసం సర్వే ప్రారంభించలేదు. మిగిలిన గ్రామాలలో సర్వే జరిగిన రికార్డుల స్థాయి వరకు వెళ్ళింది.తాజాగా రీసర్వే ఆగిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. రీసర్వేలో అనేక తప్పులు దొర్లాయని, నమోదులో పొరపాట్లు జరిగాయని చాలా గ్రామాలనుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పుడు రీసర్వే ఆగిపోతే తమ పరిస్థితి ఏంటని వారంతా వాపోతున్నారు.

నేడు, రేపు జీఎంఆర్ ఐటీలో స్టెప్కాన్ సదస్సు

విశాలాంధ్ర-రాజాం: స్థానిక జీఎంఆర్ ఐటీలో శుక్ర, శనివారంలలో రెండు రోజుల పాటు స్టెప్కాన్. 16వ జాతీయ సదస్సు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్వీఆర్ ఎస్వీ ప్రసాద్, జీఎంఆర్ వీఎఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్ లు తెలిపారు. ఈ మేరకు బుధవారం కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాన్యుని ఆధీనంలో కృత్రిమ మేధస్సు అనే అంశంతో నిర్వహించనున్న ఈ సదస్సును విశాఖపట్నం కు చెందిన బార్క్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. ఏటా జరుగుతున్న ఈ స్టెప్కన్‌కు ఆదరణ పెరుగుతోందన్నారు. విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని నూతన ఆవిష్కరణలు ప్రదర్శించ నున్నారని చెప్పారు. సమావేశంలో కన్వీనర్ డాక్టర్ టీఎస్. కిశోర్, డాక్టర్ బి.అనిల్ కుమార్, కేవీఎస్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశీల్ల వేలం పాట వాయిదా

విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సిపాలిటీలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆశీల్ల వేలంపాట వచ్చే సోమవారానికి వాయిదా పడింది. మున్సిపల్ కమిషనర్ జె. రామప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం జరిగిన వేలం పాట జరిగింది. అయితే, పాటదారులు తక్కువగా పాడడంతో వాయిదా పడింది. కార్యక్రమంలో మేనేజర్ ఎం.వి. నాగరాజు, ఆర్.ఐ.చక్రవర్తి పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయిలు ప్రారంభించిన ఎమ్మెల్యే బడుకొండ

రూ.27.40 లక్షలు జలజీవన్ నిధులతో ఏర్పాటు

విశాలాంధ్ర-పూసపాటిరేగ : మండలంలోని అల్లాడుపాలెం గ్రామంలో గురువారం నియోజకవర్గ ఎమ్మెల్యే బడుకొండ అప్పల నాయుడు చేతులమీదుగా ఇంటింటి కుళాయిలు ప్రారంభించారు. ఈ గ్రామంలో పక్క జిల్లాలో గల కెమికల్ కంపెనీల కాలుష్యం వల్ల భూగర్భ జలాలు పూర్తిగా కలుషిత మైపోయి తాగునీటికి ఈ గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ అవసరాన్ని తెలుసుకున్న ప్రభుత్వం జలజీవన్ నిధులతో రూ.27.40 లక్షలు వెచ్చించి గ్రామం మొత్తానికి 302 కుళాయిలను బిగించి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే బడుకొండ శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మండలం ఎంపీపీ మహంతి కళ్యాణి, మండల వైస్ ఎంపీపీ లు. చంటి రాజు, అల్లాడ రమేష్, జడ్పీటిసి ప్రతినిధి మహంతి జన, వైసీపి అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, వైఎస్ఆర్సిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

లోకేష్ పర్యటనకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పర్యటనకు సర్వం సిద్ధమైంది. ఎన్నికల శంఖా రావం కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం విజయనగరంలో పర్యటించనున్నారు. విజయనగరం నియోజకవర్గ ఇన్చార్జ్ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఏర్పాట్ల ను దగ్గరుండి పర్యవేక్షించారు. భారీ వేదికను ఏర్పాటు చేసి పర్యటనను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచి జనాన్ని భారీఎత్తున సమీకరణ చేస్తున్నారు. ఏర్పాట్ల నిర్వహణలో టిడిపి నాయకులు ఐవీపీ రాజు, పూసపాటి రాజేష్ బాబు, బొద్దల నరసింగరావు, ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, బంగారురాజు సహకారాన్ని అందించారు.

17న శంఖారావం సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఈనెల 17న వేపాడ మండలం, సోంపురం జంక్షన్ వద్ద నారా లోకేష్ నిర్వహించనున్న శంఖారావం బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని టీడీపీ విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాయవరపు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఎస్.కోటలోని పార్టీ కార్యాలయం వద్ద స్థానిక నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ టీడీపీ అభిమానులు, కార్యకర్తలను ఎస్.కోట మండలం నుంచి శంఖారావం సభకు తీసుకుని రావాలని కోరారు.

శంఖారావం సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-వేపాడ: ఈనెల 17న శనివారం లక్కవరపుకోట మండలం సోంపురం కూడలిలో నిర్వహించే టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయాలని మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కోట్యాడ రమణమూర్తి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన వేపాడలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శృంగవరపుకోట నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి ఆధ్వర్యంలో జరగనుంది. కావున మండలంలో గల 29పంచాయతీల నుండి పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, మాజీ ఎంపీటీసీలు నిరుజోగి ఈశ్వరమ్మ, వేచలపు జగ్గు బాబు, నాయకులు, గుంటపల్లి దేముడు నాయుడు, నిరుజోగి అమ్మ తల్లి నాయుడు, గోకాడ అచ్చం నాయుడు, నాగభూషణం,రంది మహేష్,గొర్రెపోటు రాము, చిటికిరెడ్డి అవతారం,కోటాన అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బీజెపి కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం

కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నేతల పిలుపు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : మోడీ కార్పొరేట్, మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 16 న జరిగే రైతాంగ, కార్మిక సమ్మెను జయప్రదం చేయా లని గురువారం ఉదయం ఏఐటియుసి, సిఐటియు, ఏఐకెఎస్ కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో విజయనగరం పట్టణంలో కోట జంక్షన్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ బైక్ ర్యాలీ స్థానిక కోట జంక్షన్ నుండి ప్రారంభమై మూడు లాంతర్లు, గంట స్థంభం, కన్యకాపరమేశ్వరి ఆలయం, ఎన్ సి ఎస్, రైల్వే స్టేషన్ మీదుగా ఆర్టీసి కాంప్లెక్స్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు పూడోట ప్రకాష్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సబ్బరావమ్మ, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షుడు మొదిలి శ్రీను లు మీడియాలో మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాడని, కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలను రూపొందిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేస్తూ దేశానికి తీవ్రతరమైన నష్టం కలిగిస్తున్నాడని ఆయన విమర్శించారు. ఇంకొక వైపు తమ పంటలకు చట్టబద్ధమైన కనీసం మద్దతు ధరను ప్రకటించాలని, విద్యుత్ చట్టాలను ఉపసంహరించుకోవాలని, 60 సంవత్సరాల పైబడిన వ్యవసాయ కూలీలకు పదివేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న రైతాంగం మీద మోడీ పాదం మోపుతూ నిరంకుశంగా వ్యవహరిస్తున్నాడని ఆయన దుయ్యబట్టారు. గతంలో మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చమని ప్రస్తుతము రైతాంగం డిమాండ్ చేస్తూ ఆందోళనకు పూనుకున్నది. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని చెప్పింది మోడీనే, వంట మీద అయ్యే పెట్టుబడికి మించి 50 శాతం లాభంతో మద్దతు ధర ప్రకటిస్తామని చెప్పింది కూడా మోడీని. అయితే ఇచ్చిన వాగ్దానాలన్నీ తప్పినట్టే ఈ వాగ్దానాన్ని కూడా మోడీ తుంగలో తొక్కాడని, రైతు వ్యతిరేకి కార్మిక వ్యతిరేకి ఆయన మోడీకి తగిన విధంగా బుద్ధి చెప్పాలంటే ఈనెల 16వ తారీకున జరుగుతున్న రైతాంగ కార్మిక సమ్మెను జయప్రదం చేయాల్సిన అనివార్యత మన మీద ఉందని కనుకనే ఈ పోరాటంలో రైతులు కార్మికులు యువకులు, విద్యార్థులు అందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయడం ద్వారా మన అన్నదాతలను, మన శ్రమజీవులను కాపాడుకున్న వారం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఎస్ రంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధం రాష్ట్ర జిల్లా అధ్యక్షుడు పొడుగు రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అనుబంధం జిల్లా అధ్యక్షుడు జలగడుగుల కామేష్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు, జగన్, బి రమణ, ఐఎన్టియుసి నాయకులు శ్రీను కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేటి దేశవ్యాప్త కార్మికులు, గ్రామీణ బంద్ ను విజయవంతం చేయండి

ఏఐటీయూసీ, సిపిఐ నాయకులు గోడ పత్రిక విడుదల

విశాలాంధ్ర-బొబ్బిలి: సంయుక్త కిసాన్ మోర్చా, అఖిలభారత కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 16న గ్రామీణ భారత్ బంద్ కు పిలుపునిచ్చిన సందర్భంగా బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ సిపిఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బందుకు సంబంధించిన గోడ పత్రికలు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మునకాల శ్రీనివాస్ మాట్లాడుతూ అఖిల భారత కార్మిక సంఘాలు ఈనెల 16న గ్రామీణ బందుకు పిలుపునిచ్చారని ఈ బందును పట్టణంలో ఉన్నటువంటి ప్రజానీకం అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భారత ఆహార సంస్థ, కేంద్ర గిడ్డంగుల సంస్థ గిడ్డంగులను ఇప్పటికే ఆదానిలకి కట్టబెట్టిందని ఇప్పుడు వ్యవసాయ రంగం అంతటిని కార్పొరేట్లకు అప్పజెప్పడానికి చూస్తుందని అన్నారు. ఎంతోమంది రైతులు రుణభారంతో ఆత్మహత్య చేసుకున్న రైతుల రుణాలను రద్దుచేయని ప్రభుత్వాలు బడా కార్పొరేట్ల 14 లక్షల కోట్ల అప్పులను మాత్రం రద్దు చేశారు. ఇదీ ప్రభుత్వాలకు ఉన్న చిత్తశుద్ధని అన్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధరను ప్రకటించడం లేదని, ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లని తీసుకొచ్చారని ఇవి కార్మికుల శ్రమను ఫ్యాక్టరీ యజమానులు దోపిడీ చేసే విధంగా ఉన్నాయని వీటిని రద్దు చేయాలని, కనీస వేతనాన్ని 26 వేల రూపాయలుగా నిర్ణయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట. అప్పన్న ఏఐటీయూసీ పట్టణ నాయకులు ఎంపల బాబ్జి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల గ్రామీణ బందును జయప్రదం చేయండి

విశాలాంధ్ర-గజపతినగరం : నేడు నిర్వహించనున్న పారిశ్రామిక గ్రామీణ బందును చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి లక్ష్మి కోరారు గురువారం బందుకు సంబంధించిన గోడ పత్రికను విడుదల చేశారు. కేంద్ర ట్రేడ్ యూనియన్ కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపుమేరకు మోడీ దుర్మార్గానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు బందులు చేయడానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణ గోవింద నాయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు

కాలువల్లో పూడికతీత

సమస్య పై వెంటనే స్పందించిన కమిషనర్

విశాలాంధ్ర-రాజాం: రాజాం మున్సిపాలిటీ పరిధిలో బొబ్బిలి రోడ్డులో కాలువలో చెత్తాచెదారం చేరి మురికి నీరు ప్రవహించకపోవడంతో ఆ చుట్టుపక్కల దుర్గంధంగా మరింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు ఆదేశాలతో సానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్ ప్రసాద్ పర్యవేక్షణలో పరిశుధ్య సిబ్బందితో డ్రైన్ క్లీనింగ్ గ్యాంగ్ వర్క్ చేయించి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను బయటికి తీయించారు. సానిటరీ సెక్రటరీ లకు, సానిటరీ సూపర్ వైజర్స్ కి కమిషనర్ తగు సూచనలు చేశారు. పట్టణవాసులు కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్త చెదరం వేయకుండా బయట పడేయాలని కమిషనర్ కోరారు...

ఎన్నికల నిర్వహణలో పోలీసుల పాత్ర కీలకం

కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర పార్వతీపురం/ పార్వతీ పురం టౌన్: సాధారణ ఎన్నికల నిర్వహణలో పోలీసుశాఖ విధులు కీలకమని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో పోలీసు సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించుటలో పోలీసుపాత్ర కీలకమని తెలిపారు. ఇ.వి.ఎం.లు రాజ్యాంగ వ్యవస్థకు ప్రతీక అని, వాటి పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికల కమిషను నిబంధనలు, మార్గదర్శకాలు ప్రకారం ఎన్నికల విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషను నియమావళిని ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ప్రతి నిముషం అప్రమత్తతతో ఉండాలని, ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రతి సమస్యను ఆదిలోనే పరిష్కరించి చర్యలు తీసుకున్నపుడు మాత్రమే పరిస్థితులు మన ఆధీనంలో ఉంటాయని తెలిపారు. ఎన్నికల నియమావళిలో ప్రతి విషయంపై పూర్తి వివరణ ఉంటుందని చేయవలసిన విధులు, చేయకూడని పనులు గూర్చి స్పష్టమైన అవగాహన ఉండాలని ఆయన పేర్కొన్నారు. అందుకుగాను ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరు చదివి తెలుసుకోవాలని, సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహణలో ప్రతి అంశం కీలకమని ఆయన సూచించారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన క్షణం నుండే ఎన్నికల కోడ్ అమలులోనికి వస్తుందని, ఎన్నికల కోడ్ అమలు చేయుటకు కావలసిన ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో బందోబస్తు ప్రణాళిక, పోలింగు సమయంలో విధులు, సమస్యాత్మక పోలింగు కేంద్రాలు గుర్తింపు, బందోబస్తు, ఎన్నికల సమయంలో మద్యం, గంజాయి, డబ్బురవాణా నిరోధించుట తదితర అంశాలలో పోలీసులు అవగాహన, ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ఎన్నికల కమిషను నిబంధనలు పాటిస్తూ ఎన్నికలను విజయవతం చేయాలని తెలిపారు.జిల్లా పోలీసు సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఎన్నికల విధులపై పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగిఉండాలని తెలిపారు. పోలింగు కేంద్రంలోనికి పోలీసులు ప్రవేశించకూడదన్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశం గూర్చి ఎన్నికల నియమావళిలో వివరణ ఉంటుందని, ప్రతి ఉద్యోగి చేయవలసిన, చేయకూడని పనులు గూర్చి తెలియజేస్తుందని కావున ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా తెలుసుకొని ఎన్నికల విధులు నిర్వహించాలని తెలిపారు. మారుమూల ప్రాంతాలలో పనిచేస్తున్న సిబ్బంది అప్రమత్తతతో మెలగాలని, ప్రతి అంశాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. శాంతిభద్రతలు పరిరక్షణ, బందోబస్తు విధులు విజయవంతంగా పూర్తిచేయాలని తెలిపారు.శిక్షణ కార్యక్రమంలో ఎన్నికలకు ముందు, తరువాత విధులు, పోలింగు ప్రక్రియ, నామినేషన్ల స్వీకరణ, బందోబస్తు, నామినేషన్ల స్క్రూటినీ, సమస్యాత్మక పోలింగు కేంద్రాలు గుర్తింపు తదితర అంశాలపై శిక్షణ అందించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, డిఎస్పీ మురళీధర్, పార్వతీపురం, పాలకొండ డివిజనుకు చెందిన సర్కిల్ ఇనస్పెక్టర్లు, సబ్ ఇనస్పెక్టర్లు, పోలీసు సిబ్బంది హాజరయ్యారు.

పారిశ్రామిక సమ్మె, గ్రామీణ ర్యాలీ జయప్రదం చేయండి

సీపీఐ జిల్లా కార్యదర్శి కె మన్మధరావు

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం: మోడీ ప్రభుత్వ కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న (శుక్రవారం) జరిగే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బందును జయప్రదం చేయలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతుల పంటలకు కనీస మద్దతు ధర చెల్లించి ఆహార భద్రత చట్టాన్ని పటిష్ట పరచాలని అన్నారు. భూ హక్కు చట్టం 2022ను, అటవీ హక్కుల చట్టం సవరణలను ఉపసంహరించాలని, విద్యుత్తు చట్ట సవరణ బిల్లును ఉపసంహరించి స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపాలని అన్నారు. ముఠా ఆటో మోటార్ బిల్డింగ్ తోపుడు బండ్లు మొదలగు అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టాన్ని రూపొందించాలని, ఆశ అంగన్వాడి మధ్యాహ్న భోజన పథకం వివో ఏ తదితర స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అలాగే నూతన పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2014 విభజన చట్టంలో పేర్కొన్న హామీలను తక్షణమే అమలు చేసి విశాఖ స్టీల్ ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. అలాగే అసంఘటిత రంగంలో పనిచే స్తున్న కార్మికులకు కనీస వేతనాన్ని రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు, కె.గోపినాయుడు, కార్యదర్శి పువ్వల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'రాజధాని' సినిమా విడుదల అడ్డుకోవడం అన్యాయం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: 15వ తేదీ గురువారం విడుదల కానున్న రాజధాని ఫైల్ సినిమా నిలిపివేయడం అన్యాయమని స్థానిక టిడిపి నాయకులు ఆరోపించారు.స్థానిక సౌందర్య థియేటర్ ప్రాంగణంలో నియోజకవర్గ ఇన్చార్జ్ బోనెల విజయచంద్ర ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాన్ని ఈ సినిమాలో తెలియజేయడం జరుగుతుందని, ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని లేకుండా జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న అవినీతిని ఈ సినిమాలో ఎండగట్టడం జరుగుతుందని దాన్నిచూసి ప్రజలు ఎక్కడ తెలుగుదేశం పార్టీకి సానుభూతిపరులుగా మారిపోతారో అన్న భయంతో వైసీపీ ప్రభుత్వం ఈ సినిమాను రిలీజ్ కాకుండా నిలుపుదల చేయటం జరిగిందని ఈ అన్యాయాన్ని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని త్వరలోనే ఈ ప్రభుత్వానికి సరైన బుద్ధిచెబుతారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ కార్యదర్శి మజ్జి.వెంకటేష్, నాయకులు బి సీతారాం, డి. వెంకటనాయుడు వి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాలంటీర్లకు... సత్కారం

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని 21 గ్రామ సచివాలయం పరిధిలోని 314 మంది వాలంటరీర్లకు వందనం కార్యక్రమం ద్వారా సత్కరించడం జరుగుతుందని ఎంపిడిఓ ఎంఈశ్వర రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని తామరఖండి, బగ్గందొర వలస, గెడ్డలుప్పి గ్రామ సచివాలయం పరిధిలోని వాలంటీర్లను తామరఖండిలో సత్కారం జరుగుతుందని, ఎమ్మెల్యే జోగారావు ముఖ్య అతిథిగా, ఎంపిపి, జెడ్పీటిసి తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలోని ఇద్దరు సేవావజ్రకు ఎంపికయ్యారని తెలిపారు. గాదెలవలస గ్రామానికి చెందిన బొన్నాడ సీతంనాయుడు, బూర్జకు చెందిన కోరిపల్లి లక్ష్మిలకు సేవావజ్ర ద్వారా 45వేల రూపాయల నగదుతో పాటు సత్కారం చేయడం జరుగుతోందని తెలిపారు. చినభోగిలి, వెంకటపురం, బల్ల కృష్ణా పురం, గుచ్చిమి, సూరంపేట గ్రామ పంచాయతీలకు చెందిన ఆచంటి భాగ్య లక్ష్మి, తోట రమణ, కొండూరు అశోక్, పెంకి సుకుమార్, మరడాన లక్ష్మిలు సేవా రత్నలకు ఎంపిక కాగా వారికి ఒక్కొక్కరికి 30వేల రూపాయల నగదుతో పాటు సత్కారం చేయడం జరుగుతోందని తెలిపారు. మిగిలిన 307మంది వాలంటీర్లను సేవామిత్ర ద్వారా 15వేల రూపాయల నగదుతో పాటు సత్కారం చేయడం జరుగుతోందని తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలోని నిర్మాణం పూర్తయిన తామరఖండి సచివాలయం భవనం శుక్రవారంనాడు, పెదబోగిలి-1, పెదబోగిలి -2 సచివాలయ భవనాలు శనివారం ఎమ్మెల్యే జోగారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభం చేస్తారని ఎంపిడిఓ ఈశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జనసేన పార్టీ మక్కువ మండల కమిటీ నియామకం

విశాలాంధ్ర-మక్కువ: మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గంలో జనసేన మండల కమిటీలు నిర్ణయించారు. ఈ కమిటీలు జనసేన పార్టీ జిల్లా ఇన్చార్జి లోకం మాధవి మరియు సాలూరు నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ ఆధ్వర్యంలో నియమించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉండగా సాలూరు పాచిపెంట మెంటాడ మండల కమిటీలు ఇంతకు ముందే ప్రకటించగా గురువారం మక్కువ మండల కమిటీ విడుదల చేశారు మక్కువ మండలంలో ఒకరు అధ్యక్షులు ఇద్దరు ఉపాధ్యక్షులతో పాటు 16 మంది కమిటీ సభ్యుల పేర్లను ప్రకటించారు.. వారి యొక్క వివరములు మండల అధ్యక్షులు గేదెల రిషివర్ధన్. ఉపాధ్యక్షులు వెంపడాపు సుగుణేశ్వరరావు (కోటి).. గొట్టాపు వెంకటేష్.. ప్రధాన కార్యదర్శులుగా బోను పాపారావు యాదవ్.. సింగనాపురి బంగా రాజు.. కొయ్యన జగదీష్..చింతల నరేష్.. మరియు కార్యదర్శులుగా సాలాపు జగదీష్. అల్లు శంకర్.కర్రి వినోద్ కుమార్. వంగపండు మధు. రౌతు విశ్వేశ్వరరావు.అలజంగి వసంత్ కుమార్.రౌతు మణికంఠ. సామంతల అప్పలనాయుడు. కేత రాంబాబు. మండంగి సంజీవ్.. షేక్ రహీం..దుర్గాప్రసాద్.పేర్లను ప్రకటించారు వీటితోపాటు ప్రోగ్రాం కమిటీ విభాగంలో సాలాపు జగదీష్. చింతల నరేష్, వంగపండు మధు.సామంతుల అప్పలనాయుడు. నియమితులయ్యారు మరియు ప్రచార కమిటీ లో భాగంగా అల్లు శంకర్. కర్రి వినోద్ ను నియమించారు అలాగే ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ మరియు ప్రింట్ మీడియా కోఆర్డినేటర్ గా సింగనాపురి బంగార రాజు ను నియమించగా ఎస్టీ సెల్ కోఆర్డినేటర్ గా మండంగి సంజీవ్..బీసీ సెల్ కోఆర్డినేటర్ గా బోను పాపారావు యాదవ్.. సోషల్ మీడియా కోఆర్డినేటర్ అలజంగి వసంత్ కుమార్ ను నియమించారు కమిటీ సభ్యులతో జిల్లా ఇన్చార్జి లోకం మాధవి మాట్లాడుతూ మక్కువ మండలంలో జనసేన పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ మరింత బలోపేతం చేయాలని ఆమె తెలిపారు.

నేడు సీతంపేట మండలంలో విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-సీతంపేట: మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుండి రెండు గంటల వరకు మరమ్మత్తులు కాబడిన విద్యుత్ పోల్స్ మార్చబడిన అందువలన విద్యుత్ నిలుపుదల జరుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టిజీకే మూర్తి పత్రికా ప్రకటన ద్వారా తెలి పారు. ఈ సమాచారాన్ని ప్రజలంతా గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చక్రవర్తి, విద్యుత్ శాఖ ఏఈ జి నీలిమ పాల్గొనడం జరుగుతుందని తెలిపారు.

బోజన విరామ సమయంలో ఉద్యోగ సంఘాల నాయకుల నిరసన

విశాలాంధ్ర-పార్వతీపురం: ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్జీఓ పిలుపుమేరకు పార్వతీపురం జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నభోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్టు జిల్లా ఎన్జీవో సంఘం అధ్యక్షుడు జిబిఆర్ఎస్ కిషోర్ తెలిపారు. ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలు పరిష్కారం కోరుతూ వరుసుగా రెండు రోజులు మధ్యాహ్న భోజన సమయంలో నిరసనలు చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 17న ర్యాలీలు నిర్వహణ, 20న కలెక్టర్ ఆఫీసుల ముందు నిరసనలు చేయడం ఈనెల 27న చలో విజయవాడ కార్యక్రమాలు చేపడతామన్నారు. ఉద్యోగుల జిపిఎఫ్, ఏపీ జిఎల్ఐ, సరెండర్ లీవ్ నిధులు, డిఏ బకాయిలు 8వేల కోట్లరూపాయలు, పి ఆర్ సి ఎరియర్స్ 7వేల కోట్ల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సరెండర్ లీవ్ బకాయి బిల్లులు ,హెల్త్ కార్డులు, సిపిఎస్ రద్దు, ఐఆర్ తదితర సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. చర్చల పేరిట కాలయాపన చేయడం తప్ప ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేయకపోవడం అన్యాయమన్నారు.ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేసేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామని చెప్పారు. ఆయనతోపాటు పలు శాఖలకు చెందిన ఉద్యోగ సంఘాలు నాయకులు,ఉద్యోగులు, ఏపీ ఎన్జీవో ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని నినాదాలు చేశారు. ...

వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలి

డిఎంఓ డా॥ జగన్ మోహనరావు

విశాలాంధ్ర-బెలగాం: వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షణ చేస్తూ ఉండాలని జిల్లా మలేరియా అధికారి(డిఎంఓ) డాక్టర్ టి.జగన్ మోహనరావు అన్నారు. కొత్త బెలగాం1 పరిధిలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల ఆరోగ్య వివరాలు, సిక్ రిజిస్టర్, సిక్ రూం నిర్వహణ తదితర అంశాలపై అక్కడ సిబ్బందిని ఆరా తీశారు. విద్యార్థుల్లో ఎవరికైనా జ్వర లక్షణాలు, ఇంకా ఏవైనా ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే నిర్ధారణ పరీక్షల నివేదికలు, చికిత్సా వివరాలు, రిఫర్ చేసిన వివరాలు పక్కాగా సిక్ రిజిస్టర్ లో నమోదు చేసి ఆరోగ్య పర్యవేక్షణ చేయాలన్నారు. హాస్టల్, కిచెన్ లలో వాడుక నీరు ఆ పరిసరాల్లో నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తద్వారా దోమల ప్రభావం లేకుండా ఉంటుందన్నారు. హాస్టల్, కిచెన్ సిబ్బందికి తగు పరిశుభ్రత సూచనలు చేశారు. అనంతరం ఆయన అక్కడ విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిశీలన చేసి మలేరియా, డెంగ్యూ, రక్త హీనత, పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా క్రమం తప్పకుండా ఐరన్ మాత్రలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంఓ సూర్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు మోహనరాయిడు, ఏబివిబి పట్నాయక్ ,వైద్య సిబ్బంది నారాయణమ్మ,హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-రామభద్రపురం : శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి చెందిన బస్సు ఒక వ్యక్తిని ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం... భూ సాయవలస గ్రామానికి చెందిన శ్రీనివాసరావు మోటారు బైక్ పై రామభద్రపురం శిరిడిసాయి మందిరానికి వస్తుండగా విజయనగరం నుంచి రామభద్రపురం వస్తున్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి చెందిన బస్సు బైక్ పై వస్తున్న శ్రీనివాసరావును సాయి మందిరం ఎదురుగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన శ్రీనివాసరావును ప్రాథమిక చికిత్స కొరకు 108 సహాయంతో బాడంగి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరింత మెరుగైన వైద్యం బంధువులు సహాయంతో విజయనగరం మెడికవర్ హాస్పిటల్ లో చేర్పించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు. అలాగే బస్సును అదుపులోకి తీసుకున్నామని అన్నారు.

వాలంటీర్లకు వందనం కార్యక్రమం : కలెక్టర్ నిశాంత్‌కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం : ఆపత్కాలసమయాలలో వాలంటీర్లు అందించిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో వాలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్, స్థానిక శాసనసభ్యులు అలజంగి జోగారావు హాజరైసన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియ శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ గాంధీ మహాత్ముడు కోరుకున్న గ్రామస్వరాజ్యాన్ని అందించే క్రమంలో వాలంటీరు పాత్రకీలకమని తెలిపారు. ప్రభుత్వపథకాలు అవసరమైన వారి చెంతకు చేర్చడం, పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వానికి మంచిపేరు తీసువస్తున్నారన్నారు. తలుపుతట్టి ప్రభుత్వపథకాలను అందిస్తున్నారని, సేవా అవార్డులు పొందిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు. జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ మట్లాడుతూ కోవిడ్, తుఫాన్లు వంటి విపత్కర పరిస్థితులలో వాలంటీర్లు అమోఘమైన సేవలందించారని తెలిపారు. నిబద్ధతతో వారు అందించిన సేవలు అందిస్తున్నారన్నారు. వాలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా వారికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం యాబది శాతం పెంచి సేవావజ్ర అవార్డుకు 45వేల రూపాయలు, సేవారత్న అవార్డుకు 30 వేలరూపాయలు, సేవా మిత్ర అవార్డుకు 15వేల రుపాయలు అందించడం సంతోషదాయకమని తెలిపారు. శాసనసభ్యులు అలజంగి జోగారావు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో 38 పట్టణ, 312 గ్రామీణ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న వాలంటీర్లలో 5368 మంది సేవా మిత్రకు, 90 మంది సేవా రత్నకు, 20 మంది సేవా వజ్ర విశిష్ట సేవలకు వెరశి 5478 మంది ఎంపికయ్యారని తెలిపారు. వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ, స్వలాభేక్ష లేకుండా సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ బోనుగౌరీశ్వరి, డ్వామా ప్రోజెక్టు డైరెక్టరు రామచంద్రరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులతో మహిళలకు ప్రత్యేక ఉపాధి

కోర్సుల ప్రారంభోత్సవంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులను పూర్తి చేసుకున్న మహిళలకు ప్రత్యేక ఉపాధి లభించి, తమ కాళ్లపై నిలబడి మహిళలు ఆర్ధిక స్వావలంబన సాధిస్తారని, వారి కుటుంబాలు మరింత ఉన్నతంగా ఎదగడానికి తోడ్పాటు లభిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ అన్నారు. ఎస్.కోట నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పేద మహిళలకు ఎస్.కోట పట్టణంలోని గొంప క్రిష్ణ తన కార్యాలయంలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఉచిత బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గొంప మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా "గొంప క్రిష్ణ విద్యా సంకల్పం" కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులు ప్రారంభించడం జరిగిందని, ఈ కోర్సులను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్ధికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. మొత్తం 388 రిజిస్ట్రేషన్స్ చేసుకోగా అందులో టైలరింగ్ కోసం 110 మందిని, బ్యూటీషియన్ కోర్సుకు 25 మంది మహిళలను ఎంపిక చేసామని తెలిపారు. ఎంపికైన మహిళలకు 3 నెలల పాటు న్యూ లైఫ్ అనే సంస్థ ద్వారా శిక్షణ అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో లగుడు రవికుమార్ (జామి టీడీపీ మండలం పార్టీ అధ్యక్షులు), రాయవరపు చంద్రశేఖర్ (విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు), రెడ్డి పైడిబాబు (మాజీ మండల పార్టీ అధ్యక్షులు-జామి), గుమ్మడి భారతి (నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు), జుత్తాడ రామసత్యం (మండల పార్టీ సెక్రటరీ), మాదిబోయిన మంగరాజు (ఎస్.కోట టౌన్ టీడీపీ పార్టీ ఉపాధ్యక్షులు), ఆడారి ఉమా మహేశ్వరరావు (గోపాలపల్లి సర్పంచ్), గనివాడ సన్యాసి నాయుడు (వినాయకపల్లి సర్పంచ్), కారుకొండ శ్రీనివాస్ రావు (వసి మాజీ సర్పంచ్), మండా త్రినాధ్ (మామిడిపల్లి పార్టీ ప్రెసిడెంట్), ముక్క రామకృష్ణ(తెలుగు యువత అధ్యక్షులు-వేపాడ మండలం), కిలపర్తి హరి(ఐటీడీపీ అధ్యక్షులు-ఎస్.కోట), కోర్సులకు ఎంపికైన మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అవినీతి అక్రమాలు బహిర్గతం చేస్తా..

టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ బోనెల విజయచంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అవినీతి అక్రమాలను బహిర్గతం చేసేందుకు తాము తగు సాక్షాధారాలతో సిద్ధంగా ఉన్నామని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బి విజయచంద్ర సవాల్ విసిరారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అవినీతి, అక్రమాలను ఎదిరించేందుకు తాము సిద్ధంగా ఉన్నా మని ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందామని సవాల్ విసిరారు. నీవు ఎంతటి అవినీతిపరుడివో ఈ నియోజకవర్గ ప్రజలకు అందరికీ తెలుసునని, మచ్చలేని మాపై బురదజల్లాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు. చెరువులు, భూములు కబ్జాలు చేసి దోచుకున్నది నువ్వు కాదా అని ప్రశ్నించారు. నీవు మాట్లాడే మాటలకు ఆధారాలు లేవు, కానీ మేముమాట్లాడే ప్రతి మాటకి ఆధారాలతో సహా చూపిస్తామన్నారు. పార్వతీపురం లో ఉన్న ప్రతిబందని నీ అనుచరులతో కబ్జాచేపిం చావని, నియోజక వర్గంలో ఉన్న ఏ ప్రభుత్వ భూమిని నువ్వు విడిచి పెట్టలేదని ఆరోపించారు. ధైర్యమంటే ప్రజల సమక్షంలోనే ఎవరు ఎంతటి అవినీతికి పాల్పడ్డారో తేల్చుకుందాం అన్నారు. రోజుకో నీ అవినీతి భాగో తాలు సాక్షాదారాలతో సహా ప్రజలకు చూపిస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మజ్జి వెంకటేష్ డి వెంకట నాయుడు పోల.సత్యనారాయణ బి సీతారాం వి.దాలినాయుడు, బి గౌరి నాయుడు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం..

ఎమ్మెల్సీ రఘురాజుకి స్పష్టం చేసిన మండల ప్రజా ప్రతినిధులు

రెండు రోజుల్లో సమిష్టి నిర్ణయం తీసుకుందాం : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-శృంగవరపుకోట : మీ నిర్ణయం మాకు శిరోధార్యం. మీరు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకి ఎంపీపీ, జెడ్పిటీసీ, ముఖ్య నాయకులు స్పష్టం చేశారు. ఎస్.కోట మండలం బొడ్డవరలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుని వారి స్వగృహంలో ఎం.పి.పి ఎస్.సోమేశ్వరరావు, జెడ్పీటిసి వెంకటలక్ష్మి, సర్పంచులు, ఎం.పి.టి.సిలు, వార్డు మెంబర్లు, ముఖ్య నాయకులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు గురువారం సాయం త్రం మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీ రఘురాజుతో మాట్లాడిన పిమ్మట రానున్న ఎన్నికల దృష్ట్యా మీరు ఏ నిర్ణయం తీసుకున్నా సరే, ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని తెలియజేసారు. తదుపరి ఎమ్మెల్సీ మాట్లాడుతూ పార్టీ పెద్దలు స్పందించిన తీరును చూసుకుని, పార్టీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా వారి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని, మరొకసారి అందరం సమావేశమై సమిష్టి నిర్ణయం తీసుకుందామని తెలిపారు.

డా॥ బీఆర్ అంబేద్కర్ ఆదర్శప్రాయుడు : ఎమ్మెల్యే శంబంగి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

విశాలాంధ్ర తెర్లాం/బాడంగి : బాడంగి మండలం - గొల్లాది గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదర్శప్రాయుడని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని గొల్లది గ్రామంలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహాశయుని దార్శనికతవల్లే నేడు దళిత,గిరిజన,బహుజన వర్గాలతో పాటు సకల జనులకు ఆర్థిక సామాజిక న్యాయం లభించిందని పేర్కొన్నారు. పేద ప్రజల కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన ప్రపంచం గర్వించదగ్గ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను సాకారం చేసేలా ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఎక్కడా లేని విధంగా సామాజిక న్యాయం చేస్తూ, విద్యతోనే సామాజిక ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని విద్యావ్యవస్థలో ఉన్నతమైన మార్పులు తీసుకువచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, వేదాంత డెవలపర్స్ ఎండి కోట సురేష్, సర్పంచ్ ప్రతినిధి బేతనపల్లి శంకర్రావు,మాజీ సర్పంచ్ కురిటీ సూర్యనారాయణ, ఎంపీపీ ప్రతినిధి తెంటు మధు,గర్భాపు స్వామినాయుడు,సోరు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ ఎకో సిస్టం పథకం లో పేర్లు నమోదు చేసుకోండి

మున్సిపల్ కమిషనర్ ఎల్ రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: పురపాలక సంఘ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకో సిస్టం పథకంను మున్సిపాలిటీలో ఉన్న మురుగు, సెప్టిక్ ట్యాంకు శుభ్రపరిచే కార్మికులు తమ పేర్లను వెంటనే నమోదు చేసు కోవాలని మున్సిపల్ కమిషనరు ఎల్. రామలక్ష్మి కోరారు. గురువారం మున్సిపాలిటీలో కార్మి కులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా కేంద్రం ఈ పథకం ప్రవేశపెట్టిందన్నారు. మల, మురుగు శుభ్రం చేసే కార్మికులు, సెప్టిక్ ట్యాంకు డ్రైవర్లు, హెల్పర్లతో పాటు నేటి నుంచి నమస్తే కార్యక్రమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా నిమగ్నమైనవారు కూడా ఈ పథకంలో నమోదు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీరు మరియు వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎన్నికల శంఖారావంను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-డెంకాడ: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన బాబు సూపర్ 6 పథకాలపై అవగాహన కల్పించేందుకు, నియోజకవర్గంలో ఎన్నికల శంఖారావం పూరించేందుకు శుక్రవారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ నెల్లిమర్ల నియోజకవర్గం, నెల్లిమర్ల మండలం రామతీర్ధం గ్రామం, ప్రకృతి లేఔట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రేపు ఉదయం విచ్చేయుచున్నారు. కావున తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు వేలాదిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కావున, డెంకాడ మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, క్లస్టర్ ఇంఛార్జిలు, యూనిట్ ఇంఛార్జిలు, భూత్ ఇంఛార్జిలు, కుటుంబ సాధికార సారథులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని ఈ సమావేశాన్ని విజయవంతం చేయవలసినదిగా కోరుచున్నాం

శుభ్రపరచిన రక్షిత మంచినీటి పథకం

స్వచ్ఛమైన తాగునీటి సరఫరా కోసం కలిపిన బ్లీచింగ్ పౌడర్

సింగరాయి గ్రామస్తుల హర్షం

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని సింగరాయి గ్రామంలో గ్రామ సర్పంచ్ నిరుజోగి వెంకటరావు సారధ్యంలో గురువారం రక్షిత మంచినీటి పథకం లోపలి భాగంలో పేరుకుపోయిన నాచును పూర్తిగా తొలగించారు. నీటితో పరిశుభ్రంగా క్లీన్ చేశారు. తర్వాత ట్యాంకు నిండా నీటిని నింపి సరి మోతాదులో బ్లీచింగ్ పౌడర్ కలిపారు. దాంతో గ్రామంలోని అన్ని ఇళ్ళకు తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ వెంకటరావు, పంచాయతి కార్యదర్శి కన్నంనాయుడు తీసుకున్న చొరవ పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభయ అంజనేయ స్వామి కోవెల లో విగ్రహ ప్రతిష్ట



విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి మండలం కర్లాం పంచాయతీ మోదుగుల పేట లో గురువారం జరిగిన అభయ అంజనేయ స్వామి కోవెల లో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం లో పాల్గొని ఆంజనేయ స్వామి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్న ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తనయురాలు చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర స్థానిక సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి శ్రీనివాసరావు, ఎంపీటీసీ బాణాన రమణమ్మ,రమణ ఆలయ ధర్మకర్త బాలి లక్ష్మీనారాయణ, ఋషి,శివాలయం డైరెక్టర్ ప్రభాత్ కుమార్, బొంతు తిరుపతి, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఆశయానికి తూట్లు...

అనారోగ్యం పాలౌతున్న ఏపి మోడల్ స్కూల్ విద్యార్థులు...

సక్రమంగా అమలు కాని మెనూ

పాడైపోయిన గుడ్లు పెడుతున్నారని విద్యార్థుల ఆరోపణ

విశాలాంధ్ర-కురుపాం: రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాఠశాల విద్యార్థుల్ని ఆరోగ్యవంతంగా ఉండాలనే ఆశయంతో పౌష్టికాహారం తో కూడిన మెనూ అమలు చేస్తున్న స్థానిక ఏపి మోడల్ స్కూల్ లో పౌష్టికాహారం తో కూడిన రుచికరమైన భోజనం పెట్టడం లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండం తో ఫలితంగా విద్యార్థులు అనారోగ్యం పాలౌతున్న పరిస్థితి. విద్యార్థులు, తల్లితండ్రుల సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులు మధ్యాహ్న భోజన పథకం అమలు సక్రమంగా లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని ప్రిన్సిపాల్ రామలక్ష్మి, ఉపాధ్యాయులకు ముక్తకంఠంతో ఫిర్యాదు చేశారు. తరుచూ వంటింట్లో వినియోగించే గుడ్లు కుళ్లిపోయి దుర్వాసన వస్తుందని విద్యార్థులు ఆరోపించారు. ఈనెల 14వ తేది బుధవారం మధ్యాహ్నం భోజనాలు సరిగా అందకపోవడం, ఇతర కారణాల వల్ల విద్యార్థులు సొమ్మసిల్లి పడిపోయారు. ప్రిన్సిపాల్ రామలక్ష్మికి మధ్యాహ్నం భోజన పథకం వంటివారు వచ్చిన 190 గుడ్లు పూర్తిగా పాడైపోయి దుర్వాసన వస్తుందని ఆమెకు నిర్వాహకులు తెలిపారు. అదే విషయం సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ గుడ్లు పిల్లలకు పెట్టవద్దని కొత్త స్టాక్ లో గుడ్లు అడిగి ఉడికించి పెట్టాలని సూచించారు. కొత్తగా గుడ్లు ఇచ్చేందుకు ప్రిన్సిపాల్ రామలక్ష్మి నిరాకరించినట్లు తెలిసింది. బుధవారం విద్యార్థులకు గుడ్లు పూర్తిగా పెట్టలేదని నిర్వాహకులు తెలిపారు. గురువారం ఉదయం తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు ఎంఇఓ సత్యనారాయణ, ఎంఇఓ 2 రాధాకృష్ణ తన సిబ్బందితో ఏపి మోడల్ స్కూల్ లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాడైపోయిన గుడ్లు, పాడైపోయిన రాగి పిండి నిల్వలు గుర్తించారు. అలాగే రుచికరమైన భోజనం పెట్టడం లేకపోవడం గుర్తించి హెచ్చరించారు. తరచూ మధ్యాహ్నం భోజన పథకం అమలు పై ఫిర్యాదులు వస్తున్నాయని పాఠశాల సిబ్బంది, నిర్వాహకులు తీరు మారడం లేదని మరోసారి ఫిర్యాదు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రిన్సిపాల్ రామలక్ష్మి వివరణ

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టేందుకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, పాఠశాల సిబ్బంది తో కమిటీ వేసి పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. గుడ్లు ఫిబ్రవరి మొదటి వారంలో ఒకసారి, రెండో వారంలో మరోసారి స్టాక్ వచ్చిందని మొదటి వారం వచ్చిన గుడ్లు పాడైపోయాయని తెలిపారు. బుధవారం గుడ్లు పాడైపోయిన మాట వాస్తవమే కాని తిరిగి ఉడికించి పెట్టేందుకు సమయం లేక పెట్టలేదని అన్నారు.

మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వివరణ

మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వండి పెట్టడం మా బాధ్యత ... వంటకు ఉపయోగించే సరుకుల ను విద్యార్థులు సంఖ్య ను బట్టి ఇస్తే మేమంతా సమన్వయంతో పనిచేసి మంచి భోజనాన్ని అందివ్వడం. బుధవారం పాడైపోయిన గుడ్లే పెట్టామని సూచనలు చేయడం వాగ్వాదం జరిగింది. విద్యార్థులు అనారోగ్యం పాలైతే మేం బాధ్యత వహించాల్సి ఉంటుంది.

సీతం గర్ల్స్ హాస్టల్ లో వసంత పంచమి వేడుకలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో వసంత పంచమి ని పురస్కరించుకొని 200 మంది విద్యార్థినులు పూజా కార్యక్రమాలును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మరియు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామమూర్తి పాల్గొని విద్యార్థులకు వసంత పంచమి విశిష్టతను వివరిస్తూ, వసంతం అంటే అందరికీ ఎనలేని ఆనందాన్ని ఇచ్చేదని, ఇదే రోజున పవిత్రమైన గ్రంథాలను సరస్వతీ దేవి విగ్రహం దగ్గర ఉంచి ప్రత్యేక పూజలు చేస్తారని, వసంత పంచమి రోజున సరస్వతీ దేవి జన్మించిందని తెలిపారు. అందుకే ఈరోజున సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేయడం వల్ల ఆ తల్లి అనుగ్రహం పొందొచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శశిభూషణ్ రావు మాట్లాడుతూ, ప్రస్తుత నేపథ్యంలో నైతిక విలువలు మరుగున పడిపోతున్నాయని వాటిని పునరుద్ధరించాల్సిన అవసరం వుందని, ప్రేమ పేరుతో యువతి యువకులు తప్పు దారిన పడుతున్నారని, వారు దీనిని అర్థం చేసుకోవాలని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించి వారి సహాయ సహకారాలతో వారి జీవితానికి లక్ష్యాలను, గమ్యాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సందర్భంగా విద్యార్థులు ప్రేమ వివాహం వల్ల వచ్చే, జరిగే కష్టనష్టాల గురించి చర్చించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ కెప్టెన్ సత్య వేణి ,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వెంపడాపు గొల్లబాబును ఆదుకోవాలి

విశాలాంధ్ర-చీపురుపల్లి : వంగపల్లిపేట గ్రామంలో గత ఆరేళ్ల నుండి వెన్నెముక విరిగి మంచంబారిన పడిన వెంపడాపు గొల్లబాబుకు వైద్య ఖర్చుల నిమిత్తం 3వేలు ఆర్థిక సహాయాన్ని గుర్ల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ ఎస్ డా. బి కామేశ్వరరావు(వృద్ధ మిత్ర కో-ఆర్డినేట్), భవానీ, శ్రీను లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని గొల్ల బాబుకు(వికలాంగుడు) పెద్ద మనస్సుతో దాతలు ముందుకు వచ్చి సహాయంచేసి అతడ్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జె.అప్పల నాయుడు, దాసు, ప్రేమ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో బొబ్బిలి వీణ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: పురపాలక సంఘ కార్యాలయం సుందరికరణంలో భాగంగా బొబ్బిలి ప్రాంతానికే ప్రసిద్ధి గాంచిన బొబ్బిలి వీణ ను మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళి కృష్ణ రావు ఆధ్వర్యంలో కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేశారు. గురువారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ముఖ్య అతిధిగా హాజరై బొబ్బిలి వీణను ఆవిష్కరణ చేశారు. అనంతరం జగనన్న స్వచ్ఛ్ సంకల్పం పథకం లో భాగంగా బొబ్బిలి మున్సిపాలిటీకి మంజూరైన తడి చెత్త,పొడి చెత్త,వాహనాలు ఆయన చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్ రామలక్ష్మి, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పాలవలస ఉమామహేశ్వరరావు, సవలాపురపు రామకృష్ణ, ఇంటి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

విశాలాంధ్ర-జామి: మండలంలోని అలమండ గ్రామంలో మెయిన్ రోడ్డు పై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే అలమండలోని పోస్ట్ ఆఫీస్ వీధికి చెందిన పత్తికొండ సత్యవతి(60) అనే మహిళ పాలు కోసం కలానికి వెళుతుండగా స్థానిక గ్రామీణ బ్యాంకు ఎదురుగా మెయిన్ రోడ్డు పై వేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సత్యవతి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన లారీని డ్రైవర్ అక్కడ నుంచి ఆపకుండా అతి వేగంగా తీసుకు పోయాడు. దీంతో స్థానికులు లారీ నెంబర్ను గుర్తుపట్టలేకపోయారు. సంఘటన సమాచారాన్ని జామి పోలీసులకు అందజేయగా, పోలీసులు వచ్చి పరిశీలన చేశారు. ఎస్సై వీరబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామి లోని మాధవరాయ మెట్ట కాలనీలో గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళా జాతర ద్వారా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. మహిళా సంఘాల సభ్యులు, పురుషులు, కిషోర్ బాలికలకు బాల్యవివాహాల నిరోధనానికి సంబంధించి కొన్ని విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పి సునీత, వెలుగు ఏపీఎం మధు మహేష్, మహిళా సంఘాల సభ్యులు, మహిళా సమైక్య కు చెందిన రామలక్ష్మి స్థానిక అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ మూవీ ఆపేసిన రెవెన్యూ సిబ్బంది

విశాలాంధ్ర-పూసపాటి రేగ : మండలంలో సాయి కృష్ణ సినిమా థియేటర్‌లో ఆడుతున్న రాజధాని ఫైల్స్ సినిమాను ఆపివేయవలసిందిగా పూసపాటి రేగ మండల రెవిన్యూ అధికారి, మండల రెవెన్యూ అధికారులు కలిసి వచ్చి షో నిలిపివేయాలని సినిమా హాలు సిబ్బందికిచెప్పడంతో వెంటనే ఆ సినిమాను నిలిపివేశారు.

కాపు, తెలగ, బలిజ ఒంటరి కులాలను బీసీ జాబితాలో చేర్చాలి

కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు



విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : కాపు తెలగ బలిజ ఒంటరి కులాలను బీసీ జాబితాలో చేర్చాలని ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు ప్రభుత్వం కాపు తెలగ బలిజ ఒంటరి కులాలను తక్షణమే బీసీల్లో చేర్చాలని రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు ఉత్తరాంధ్ర తెలగ సంక్షేమ సంఘం అధ్యక్షులు చనమల్ల ప్రసాదరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ 1915 వ సంవత్సరం నుండి 1966వ సంవత్సరం వరకు కాపు తెలగ బలిజ ఒంటరి కులాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు అమలు చేసిందన్నారు నేటికీ ఈ కులాలు వెనుకబడే ఉన్నాయని, రిజర్వేషన్ రద్దు చేసి అన్యాయం చేశారన్నారు రిజర్వేషన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు జనాభా పరంగా ఈ కులాల జనాభా అధికంగా ఉన్నప్పటికీ రాజ్యాధికారంలోనూ పదవుల్లోనూ ఉద్యోగాల్లోనూ ప్రాధాన్యత కల్పించకపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు కాపు తెలగ బలిజ ఒంటరి కులాలు ఐక్యంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు న్యాయమైన తమ కోర్కెలు పరిష్కరించడానికి ఏ రాజకీయ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రస్తావించి హామీ ఇస్తుందో ఆ పార్టీని రాబోయే ఎన్నికల్లో గెలిపిస్తామన్నారు తమ సమస్యలు తీరేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు ఈ కార్యక్రమంలో బీసీ కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈఓ బాల భాస్కరరావు

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని జాకేరు సచివాలయం పరిధిలోగల జాకేరు,కరకవలస మండల పరిషత్ ఉన్నత పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి బాల భాస్కర్ రావు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను,విద్యార్థుల వర్క్ బుక్కులను పరిశీలించారు. అదే విధంగా తెలుగు,ఇంగ్లీష్ చదవడం రాయడం వంటి విద్యార్థుల నైపుణ్యతను పరిశీలించారు. ఎలక్షన్ పోలింగ్ బూత్లను పరిశీలించి, ఎలక్షన్ వసతులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మరో రెండు నెలల్లో తెదేపా అధికారంలోకి రానుంది : నారా లోకేష్

విశాలాంధ్ర - రాజాం : మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కొండ్రు మురళీమోహన్ ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అధ్యక్షతన పూరించిన "శంఖారావం" కార్యక్రమం బహిరంగ సభ రాజాం పాలకొండ రోడ్డులో నిర్వహించారు. ముందుగా లోకేష్ తో కలిసి కొండ్రు స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ కేబినెట్ మంత్రులను అర్థరాత్రి లేపి అడిగితే వారి శాఖలే వారికి తెలియని స్థితిలో ఉన్నారని పూలమాలలు గుర్తించారు. దేశంలోనే చెత్త కేబినెట్ గా జగన్ కేబినెట్ ను అవార్డు ఇవ్వాలని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి నిజం చెబితే తల వెయ్యి ముక్కలు అవుతుంది అందుకే జగన్ అన్నీ అబద్ధాలే చెబుతారు అని వ్యంగ్యం విసిరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలను ఈ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ఉత్తరాంధ్ర మంత్రులు ఉత్తరాంధ్ర ను గాలికి వదిలేసి కబ్జాలు గుమ్మనిలో కూడా ట్రాన్స్ఫర్ చేసుకొని పరిస్థితి నెలకొందన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి నాలుగు సంవత్సరాల పది మాసాల్లో వివిధంగా ద్రోహం చేశారు కళ్ళారా చూశాం అని అన్నారు. కేంద్రం మేడలు వంచి ప్రత్యేక హోదా సాధించి పరిశ్రమలు తెచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తాం అని చెప్పి మాట తప్పారు. మాటలతో నిరుద్యోగులను నట్టేట ముంచారన్నారు. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలంటే అది ఒక్క యువనాయకుడు నారా లోకేష్ తోనే సాధ్యం అని అన్నారు. యువతకు సరియైన అవకాశాలు లేక ఉపాధి, నైపుణ్యం లేక రాష్ట్రంలో కోటిన్నర మంది యువత యువకులు నిరుద్యోగులుగా ఉన్నారని, ఇప్పుడు ఎదుర్కొంటున్నారన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుని అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతుందన్న నమ్మకం ప్రపంచమంతా భరోసా కల్పించామని గుర్తుచేశారు. ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అంధకారం లోకి నెట్టారు. ఆంధ్రప్రదేశ్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నరాష్ట్రంగా అందరూ చెప్పుకున్నారు. నేడు సీఎం జగన్ పాలనలో అత్యంత వేగంగా తిరోగమన బాట రాష్ట్రం నిలిచి ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అగమ్యగోచరం మైంది. దేశ ఆర్థిక వ్యవస్థ కు ఆయువుపట్టు నేటి యువతరం, రాష్ట్రంలో యువతి యువకులు ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయిన పరిస్థితి ఈ వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, రెండు లక్షల ముప్పై వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం జగన్ మోహన్ రెడ్డి మాట తప్పి మడం తిప్పారన్నారు. ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు, అనాలోచిత నిర్ణయాలు, నిరంకుశ చర్యలతో రాష్ట్రం తిరోగమనం బాటపట్టింది. పెట్టుబడులు ఆకర్షం చడంలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగు కి నెట్టబడిందన్నారు. పారిశ్రామిక రంగం కుదేలు అయింది. సీఎం జగన్ నియంతృత్వ పాలనలో అన్ని వర్గాల రోడ్ల పై ఆందోళనల కు దిగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. శంఖారావం సభకు వేల పాల్గొన్న తెదేపా నాయకులు కార్యకర్తలకు అభి మానులకు యువతి యువకులకు మహిళలకు జనసేన నాయకులకు జన సైనికులకు కొండ్రు కృతజ్ఞతలు తెలిపారు.

ఫీడర్ ఛానల్ పనులు పరిశీలన

విశాలాంధ్ర - గజపతినగరం : మండలం లోని పాతబగ్గం గ్రామంలో జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులను ఉపాధి హామీ పథకం ఏపీవో సిహెచ్ రామారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్లను పరిశీలించారు. జాబ్ కార్డ్ ఉన్న వారందరికీ పనులు కల్పించాలని సూచించారు. కొలతల ప్రకారం పనిచేసి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు.

20న మున్సిపల్ షాపుల వేలం

విశాలాంధ్ర - బెలగాం : ఆర్థిక సంవత్సరము 2024- 25నకు సంబంధించి పార్వతీపురం పురపాలక సంఘం ఆధీనములో యున్న రాజీవాగ్ మార్కెట్ మరియు రోడ్డు మార్జిన్ నందు రోజువారి ఆశీలు మరియు కమేలాల యందు ఆశీలు వసూళ్ల చేసుకొనే హక్కును ఇచ్చుటకు బహిరంగ వేలం ది.20వ తేదీ మంగళవారం ఉదయం గం.,11.00ని.,లకు నిర్వహించబడునని, ఐడీఎస్ఎంటి షాపు రూములలో ప్రస్తుతం ఖాళీగా యున్న 22, 32, 35, 44 మరియు 46 షాపు రూములను గుత్త నిబంధనల ప్రకారము గుత్తకు ఇచ్చుటకు అదే రోజు ఉదయం గం.,11.30ని.,లకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణ యందు బహిరంగ వేలం నిర్వహించబడును. ఆసక్తిగల వారు సదరు బహిరంగ వేలంలో పాల్గొనవలసినది కోరడమైనది. పూర్తి వివరముల నిమిత్తము కార్యాలయము పని గంటలలో సంప్రదించ గలరని మున్సిపల్ కమిషనర్ పి సింహాచలం కోరారు.

గ్రావెల్ తవ్వకాలపై నిందలు వేయడం తగదు

ఎమ్మెల్యే అప్పల నరసయ్య

విశాలాంధ్ర - గజపతినగరం : జనక గ్రావెల్ తవ్వకాలపై తమపై లేనిపోని నిందలు వేయడం తగదని గజపతినగరం శాసనసభ్యులు బొత్స అప్పల నరసయ్య గురువారం గజపతినగరంలోని వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విప్పినా తప్పు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. దొంకలాండం దాచుకోవడం టిడిపి నైజం అని ఆరోపించారు. తమ వద్ద ఎటువంటి జెసిబి లు ట్రాక్టర్లు లేవన్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై అధికారులు చర్యలు చేపట్టారని అన్నారు. బుధవారం రాత్రి బోండ పల్లి మండలం గురడ బిల్లి గ్రామంలో జెసిబి ల తో మైనింగ్ అక్రమ రవాణా చేస్తున్న సందర్భంలో ఏడు ట్రాక్టర్లు రెండు జెసిబిలను పోలీసులు మైనింగ్ అధికారులు సీజ్ చేసి పెట్టారని దానిపై టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ కే ఏ నాయుడు రాత్రి దానిని రాద్ధాంతం చేసిన సంగతి పై వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. ఆ ట్రాక్టర్లు జెసిబి లు తెలుగుదేశం వారివే అని మండలంలోని గొల్లపేట కు చెందిన టిడిపి నాయకులు సత్తిబాబు కొండకరకం గ్రామానికి చెందిన మీసాల పైడిరాజు వారివి అని టిడిపి వారే అని అన్నారు. మీ నాయకుడు నారా లోకేష్ నేడు జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా మీ నాయకుడు వచ్చి పోనీ మాట లు చెప్పి మా పై బురద చల్లడం ఎంతవరకు సబబు అని అన్నారు. అవినీతిని నిరూపించాలని లేదంటే లోకేష్ కూడా సమాధానం చెప్పాలని కోరారు. మీరు దొంగతనాలు చేసుకొని మా ప్రభుత్వం పై అన్యాయంగా అధికారులను నాయకులను బెదిరించి మా పార్టీ కి చెడ్డ పేరు తేవడం ఎంతవరకు సబబు అని అన్నారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ తో ప్రభుత్వ కార్యక్రమాలకు ఎవరిదైనా సహాయ సహకారాలు అనుమతితో పరిమిషన్ తీసుకొని మేము ఇస్తున్నామని అన్నారు. నిజాయితీగా విపక్షపాతంగా మాట్లాడి దయచేసి నాయుడు అర్థం చేసుకోవాలని ఇప్పటికైనా మీరు దొంతులేదు దాచుకోవటం తప్ప ఏమి చేశారని అన్నారు. మా మీద అబండాలు మోపితే సహించేది లేదని దీనికి మీ నాయకుడు నారా లోకేష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు బూడి వెంకటరావు కరణం ఆదినారాయణ మండల సురేష్ కడగల పైడిపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాత ప్రభుత్వం వైసీపీ

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

విశాలాంధ్ర - బలిజిపేట : రైతు పక్షపాత ప్రభుత్వం వైఎస్సార్సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. గురువారం మండలంలోని పెద్దింపేట గ్రామంలో రైతు భరోసా కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించి రైతన్నలకు అంకితం చేశారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతుల శ్రేయస్సే పరమావధిగా భావించి రైతన్నను రాజుగా చేసేందుకు అవసరమైన ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకురావడం జరిగిందని, రైతన్నకు అండగా నిలిచి వారికి చేదోడు వాదోడుగా ఉండాలనే ఉద్దేశంతో దేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి సచివాలయ కేంద్రంలోనూ రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వారిద్వారా రైతులకు విత్తనం నుంచి పంట ఎరువులు, భూసార పరీక్షలు, ఆఖరికి పండించిన పంట అమ్ముకోవడం వరకు ప్రతిదీ కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా నిర్వహించి రైతన్నలు పండించే పంటను లాభ సాటిగా ఉండేలా చేయడం, మద్దతు ధర ప్రకటించడం వంటి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో జెడ్పీటీసీ అలజంగి రవికుమార్, ఎంపీపీ గుడివాడ నాగమణి, వైస్ ఎంపీపీ వెలిది సాయిరాం, మండలపార్టీ అధ్యక్షుడు పాలవలస మురళీ కృష్ణ, స్థానిక ఎంపీటీసీ ముదిలి సాంబమూర్తి, అధికారులు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తి నివారణ చర్యలు చేపట్టాలి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్. టి.జగన్ మోహనరావు

విశాలాంధ్ర - సాలూరు టౌన్ : దోమల వ్యాప్తి నివారణ చర్యలు చేపట్టి, జ్వరాలు ప్రబలకుండా చూడాలని జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ ఆసుపత్రి ల్యాబ్ లను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ రోజూ ఎంతమంది రోగులు ఆరోగ్య తనిఖీల కొరకు వస్తున్నారు. వారి ఆరోగ్య సమస్యల వివరాలను రికార్డులో తనిఖీ చేశారు. జ్వర లక్షణాలకు చేయుచున్న నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలను ల్యాబ్ రికార్డులో పరిశీలించారు. మలేరియా,డెంగ్యూ జ్వరాలు నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందజేసి వివరాలు డీఎంఓ కార్యాలయానికి తెలియజేయాలని ఆదేశించారు. దోమల ఆవాస ప్రదేశాలను గుర్తించి వెక్టర్ కంట్రోల్ హైజిన్ యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. అవిఘటంగా ఆ ప్రాంతంలో నివారణ చర్యలు చేపట్టాలని,డ్రైడే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని అన్నారు. అందుకు సంబంధిత శాఖల సమన్వయం అవసరమన్నారు. క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వే చేపట్టాలన్నారు. ప్రాంతీయ ఆసుపత్రి ల్యాబ్ లో రికార్డులు పరిశీలించి జ్వరాల వివరాలు ఐహెచ్ఐపి పోర్టల్లో నమోదు చేయాలని, ఏ ప్రాంతానికి చెందినవో తెలియజేయాలని సూచించారు. అనంతరం డాక్టర్ జగన్ మోహనరావు మున్సిపల్ కమిషనర్ పి. ప్రసన్నవాణి తో సమీక్ష జరిపారు. దోమల వ్యాప్తి నివారణ చర్యలు, పారిశుద్ధ్య కార్యక్రమాల అంశాలపై చర్చించారు. వీటిని మెరుగు పరిచే దిశగా ఆ యా వార్డుల్లో సచివాలయ,వైద్య సిబ్బంది సమన్వయం అవసరమని అన్నారు.అనంతరం ఆయన కుర్మరాజు పేటలో హెల్త్ వెల్నెస్ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, వైద్యాధికారులు డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ ఎ.ప్రియాంక, సబ్ యూనిట్ అధికారి ఎం.ఈశ్వరరావు, హెల్త్ సూపర్ వైజర్ కె.లక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

బలిజిపేట ఎంఈఓ-1 సామలకు ఆత్మీయ సత్కారం

విశాలాంధ్ర - బలిజిపేట : మండల కేంద్రంలో పెదపెంకి నేతాజీ గ్రంథాలయం స్థాపకులు తర్ర సంజీవ నాయుడు ఆధ్వర్యంలో, బలిజిపేట సత్యసాయి కన్వీనర్ వెలిది సుబ్బారావు చేతుల మీదుగా ఎంఈవో1 సామల సింహాచలంని శాలువా, పూలమాలతో ఆత్మీయంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంజీవి నాయుడు మాట్లాడుతూ బలిజిపేట మండల విద్యాశాఖాధికారిగా సామల సింహాచలం చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని అన్నారు. ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన కొద్ది కాలంలోనే మండలంలోని పాఠశాలలను చక్కగా పర్యవేక్షణ చేస్తూ, విద్యారంగ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఆర్ఎంటీలు మధు, సుబ్బారావు, అతిథి, ఆఫీస్ సిబ్బంది భద్ర, శారద, రమణమ్మ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్లో మెరిసిన విద్యా కుసుమం

విశాలాంధ్ర - గజపతినగరం : జేఈఈ మెయిన్స్లో గజపతినగరం మండలం పురిటిపెంట న్యూ కాలనీకి చెందిన దాకి మాధవ రావు 98 పర్సంటేజ్ సాధించారని వారి తల్లిదండ్రులు తెలిపారు. మాకు ఎంత ఆనందంగా ఉందని ఇంకా ఎన్నో ఉన్నత చదువులు చదవాలని కోరారు. మాధవరావు ర్యాంకు సాధించడం పట్ల పలువురు అభినందించారు.

జర్నలిస్ట్ పరమేశ్వరరావు మీద జరిగిన దాడిని ఖండించాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : జర్నలిస్ట్ పరమేశ్వరరావు మీద జరిగిన దాడిని ఖండించాలని, దాడి చేసిన వైసీపీ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వద్దిన సన్యాసి నాయుడు గురువారం డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో వచ్చిన మాట్లాడుతూ పల్నాడు జిల్లా అమరావతి మండలం, మల్లాది గ్రామంలో ఇసుక అక్రమ రవాణాను బయట పెట్టిన అమరావతి ఈనాడు దినపత్రిక విలేకరి పరమేశ్వర రావు మీద జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై దాడిగా గర్హించారు. వైయస్ రాజశేఖర రెడ్డి, జగన్ లు ఇద్దరూ జర్నలిస్ట్ మీద నల్ల చట్టాలు తీసుకుని రావడం సిగ్గు చేటన్నారు. పల్నాడు ఎస్.పి రవి శంకర్ రెడ్డి నిర్లక్ష్యంగా ఉన్నందున మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, జర్నలిస్ట్ ల మీద, జనసేన, టీడీపీ నాయకుల మీద దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మీద జర్నలిస్ట్ సంఘాలు చేసే పోరాటాలకు కాపు సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని సౌత్ ఇండియా కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వద్దిన సన్యాసి నాయుడు ప్రకటించారు.

బాకాయిలు తక్షణమే విడుదల చేయాలి

ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ కార్యదర్శి రామారావు

విశాలాంధ్ర - బొబ్బిలి : ఉద్యోగ ,ఉపాధ్యాయ, కార్మిక, పింఛనుదారులు కు ప్రభుత్వం చెల్లించాల్సిన 25 వేల కోట్ల రూపాయల బాకాయిలను తక్షణమే విడుదల చేయాలని జెఏసి నాయకులు జెసి రాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర జెఏసి ప్రకటించిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా బొబ్బిలి తాలూకా జేఏసీ కార్యదర్శి జి.రామారావు ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో స్థానిక జలవనరుల పర్యవేక్షక ఇంజనీర్ వారి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాకాయిలు చెల్లించాలని, 12 వ పి ఆర్ సి ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి ని ప్రకటించాలని, ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని,సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, జెట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమ బద్ధీకరించాలని నినాదాలు చేస్తూ నిరసన తెలియ చేశారు. ఈ నెల 27 వ తేదీవరకు ఉద్యమ కార్యాచరణ కొనసాగుతుందని 17వ తేదిన తాలూకా కేంద్రాలలో నిర్వహించనున్న ర్యాలీ మరియు ధర్నాను విజయవంతం చేయాల్సిందిగా జలవనరుల శాఖ ఉద్యోగుల నాయకుడు జెఏసి సభ్యుడు జి.రామారావు తెలియ చేశారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ సూపర్ డెంట్ ఎల్ సరోజ్ కుమార్, ఏపీ ఎన్జీఓ సతీష్ కుమార్, బి.శ్రీ లత, జి ఏసి నాయకులు బంకురు ప్రసాద్, చిక్కి శ్రీనివాస రావు, తదితర లు పాల్గొన్నారు.

ఘనంగా లోకం మాధవి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - భోగాపురం : నెల్లిమర్ల ఇంచార్జి లోకం మాధవి జన్మదిన వేడుకలు గురువారం భోగాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి పెద్ద ఎత్తున నియోజక వర్గం నుంచి భారీగా జనసేన కార్యకర్తలు, మద్దతు దారులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనసేన టిడిపి కూటమితోనే నెల్లిమర్ల నియోజక వర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. వైకాపా ప్రభుత్వం తీరుతో ప్రజలంతా విసిగి పోయారని అన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో జనసేన టిడిపి కూటమి కచ్చితంగా గెలుస్తుందని అన్నారు. అనంతరం నెల్లిమర్ల మండలం లోని అల్లిపాలెం, రామతీర్థాలు, పూసపాటిరేగ మండలం లోని చల్ల వాని తోట, గోవిందపురం, డెంకాడ మండలం రాజుల తమ్మాపురం గ్రామానికి చెందిన సుమారు 90 కుటుంబాలు ఆయా పార్టీలను వీడి జనసేన పార్టీలో చేరారు. వీరందరికి లోకం మాధవి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జనసేన శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పల్లంట్ల జగదీష్, వర్కల రాంబాబు, కరుమజ్జి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం మహిళా కళాశాల అధ్యాపకులు విస్తృత ప్రచారం

విశాలాంధ్ర - శృంగవరపుకోట : పదవ తరగతి తర్వాత ఇంటర్మీడియట్లో చేరదల్చుకున్న విద్యార్థినిలు అన్ని సౌకర్యాలు గల ధర్మవరం హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ లో (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల) చేరాలని హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ పి.జి.టి. అధ్యాపకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. శృంగవరపు కోటలో గల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిలను గురువారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్.ఎం బి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల)లో సకల సౌకర్యాలు ఉన్నాయని, విజయనగరం జిల్లా మొత్తం మీద ధర్మవరం బాలికల ప్రత్యేకంగా మంజూరు చేసిన ఒకే ఒక మహిళా జూనియర్ కళాశాల ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్నట్లు తెలిపారు. అలాగే ఎస్.కోట బాలికోన్నత పాఠశాల హెచ్.ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ ధర్మవరం మహిళా జూనియర్ కళాశాలలోనే ఎక్కువ మంది అమ్మాయిలు చేరాలని విద్యార్థినిలను కోరారు. హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ అధ్యాపకులు సురేంద్రనాథ్, శివాజీ, రహీం షేక్ లాల్, మూర్తి(సతీష్), కృష్ణరాజు, జయలక్ష్మి మాట్లాడుతూ ధర్మవరం హై స్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ (ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల) లో ఉచిత విద్య తో పాటు ఉచితంగా టెక్ట్ పుస్తకాలు అందజేస్తున్నది అలాగే ల్యాబ్, లైబ్రరీ అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి అనంతరం విద్యార్థులు ధర్మవరం ప్రభుత్వ మహిళా కళాశాలలోనే చేరాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం హైస్కూల్ ప్లస్ అధ్యాపకులు పొట్నూరు శివాజీ, మూర్తి (సతీష్ మాస్టర్), రహీం షేక్ లాల్, సురేంద్రనాథ్, కృష్ణరాజు, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేకువ జామునుండే ముడుపుల పూజలు

విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రంలోని సువర్ణముఖినదికి ప్రక్కనే గల శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో ప్రతి గురువారం నాడు నిర్వహిస్తున్న ముడుపుల పూజలకు వేకువ జాము నుండే భక్తులువివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున విచ్చేసి భక్తి శ్రద్ధలతో ఓం నమో శ్రీలక్ష్మి నరసింహ స్వామినేనమః అంటూ పూజలలో పాల్గొంటు న్నారు. ఆలయఅర్చకులు పీసపాటి శ్రీనివాసా చార్యులు, రామాను జాచార్యులు, కృష్ణ మాచార్యులు, మురారీలు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గురువారంనాడు రకరకాల పూలతో అలంకరించిన తీరు అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రతీ గురువారం నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి నరసింహస్వామి ముడుపుల పూజలు దూర ప్రాంతాల నుండి వాహనాలతో భక్తజనం పెద్ద ఎత్తున విచ్చేసి భక్తి శ్రద్ధలతో పూజలను చేసి స్వామివారిని దర్శించుకుని, గోవింద గోవింద, జైశ్రీలక్ష్మీనరసింహ, ఓం నమో నారాయణాయ అంటూ 27సార్లు ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్త,పాత భక్తులు కలిపి పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి దీక్షపట్టారు, భక్తులకు ఇబ్బంది లేకుండా పూజలు నిర్వహిస్తున్నారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా సకల ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతి గురువారం స్వామివారిని వివిధరకాల పూలతో అలంకరించడం, భక్తుల ప్రదక్షిణలు,పూజలు, ప్రసాదాలు స్వీకరించడం తదితర అంశాలను అంతా కలిసికట్టుగా ఉండి భక్తులు చేస్తూ అర్చకులకు సహకారాన్ని అందిస్తున్నారు. ఇక్కడ ఉదయం పూట జరుగుతున్న పూజావిధానం చూస్తే సింహాచలం, విజయవాడ, తిరుపతి, తదితర ప్రముఖ ఆలయాల్లో ఉండే ఆధ్యాత్మిక అనుభూతి కలుగుతుంది.

గ్రామీణ ప్రజలు మెరుగైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర - బెలగాం : హెల్త్ వెల్నెస్ కేంద్రాల్లో గ్రామీణ ప్రజలు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంఓ డాక్టర్ టి. జగన్ మోహన రావు అన్నారు. సీతానగరం పిహెచ్సి లో క్షేత్ర స్థాయి సిబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ఆరోగ్య కార్య క్రమాలపై సమీక్ష జరిపారు. ప్రజారోగ్య దృష్ట్యా ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలు, వైద్య సదుపాయాలను ప్రజలకు పూర్తి స్థాయిలో వినియోగించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందు బాటులో ఉండాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో హెల్త్ వెల్నెస్ కేంద్రాలను ఏర్పాటు చేశారని, రకాల వైద్య పరీక్షలు, పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

రూ. 21.30 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలో 44,46 డివిజన్లో 21.30 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రహదారులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారం భించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయనకు స్థానిక నాయకులు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించి పూల మాలలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ నగరంలో అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చూపుతున్న కృషి అభినందనీయమన్నారు. నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నదే ఆయన ధ్యేయమని అన్నారు. అందుకు తగ్గట్టు గానే సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత చూపుతున్నారన్నారు. పేద ప్రజలకు ఆకలి బాధ తీర్చే విధంగా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి ఆహారాన్ని అందిస్తున్నారని అన్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ వేసవిలో కూడా ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం చూస్తున్నామన్నారు. 44వ డివిజన్ వైసీపీ ఇంచార్జి లంక మహేష్ మాట్లాడుతూ తమ డివిజన్లో ఎప్పుడూ లేనంత అభివృద్ధి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో జరుగుతుందన్నారు. నాలుగు కోట్ల పైబడిన అభివృద్ధి పనులు జరగడం తమ అదృష్టం అన్నారు. 2.5 కోట్ల రూపాయలతో రెండు వాటర్ ట్యాంకులు నిర్మించి ప్రజల దాహార్తిని తీర్చిన మంచి వ్యక్తి వీరభద్రస్వామిని కొనియాడారు. మరల ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జి తమ్ము, 46 వ డివిజన్ కార్పొరేటర్ బొద్దూరు గోవిందమ్మ, బొద్దూరు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీడీఈ పై ఒకరోజు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జెఎన్టియు గురజాడ జవహర్లాల్ నెహ్రూ టెక్నోలజికల్ యూనివర్సిటీ గురజాడ లో గురువారం జరిగినటువంటి వన్ డే ఓరియంటేషన్ ప్రోగ్రాం ఆన్ బిసిడి ఈ యాక్టివిటీస్ అండ్ బెనిఫిట్స్ అనే కార్యక్రమాన్ని బిసిడిఈ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,జెఎన్టియు గురజాడ విజయ నగరం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్టియువి ఉపకులపతి ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తమ యొక్క నైపుణ్యాలను పెంపొందించాలని ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని తెలియజేశారు. మరియు సాంకేతిక రంగం పట్ల యువత పట్టు సాధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన బిసిడిఈ సెక్రటరీ &CEO సీఈవో ప్రొఫెసర్ దేవకుమార్ మాట్లాడుతూ బి సి డి ఈ యొక్క ఆవశ్యకతను మరియు దాని యొక్క విజన్ అండ్ మిషన్ గురించి, దాని యొక్క పనితీరు గురించి తెలియజేశారు. అందరు విద్యార్థులు బిసిడిఈ కార్యక్రమాలలో తప్పనిసరిగా విధిగా పాల్గొనాలని కోరారు. ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం వలన విద్యార్థుల వారి యొక్క నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఇంటర్న్ షిప్ వంటి అవకాశాలు కూడా విద్యార్థులకు ఎక్కువగా లభిస్తాయని తెలియజేశారు. ఇందులో భాగంగా విద్యార్థులు చిన్న వీడియోలు ప్రభుత్వ పథకాల మీద మరియు సమాజంలోని వివిధ సమస్యల పట్ల అందరికీ అవగాహన కలిగించేటట్లుగా చేయాలి. ఇందులో భాగంగా ఏపీ డెవలప్మెంట్ క్విజ్ కూడా నిర్వహించారు. బిసిడిఈ కన్సల్టెంట్ సిద్ధాన్ మెంటార్గా వ్యవహరించారు. ఆమె మాట్లాడుతూ బిసిడిఈ అంబాసిడర్స్ అండ్ స్కాలర్స్ కి దిశా నిర్దేశం చేశారు. అనే వెబ్సైట్ ద్వారా హాజరైన విద్యార్థులు స్పందనలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ , బిసిడిఈ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డా. జీ.జే.నాగరాజు మరియు యూనివర్సిటీ కాలేజ్ కోఆర్డినేటర్,అనుబంధ కళాశాలల బి సి డి ఈ కోఆర్డినేటర్లు, అంబాసిడర్లు, స్కాలర్లు పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం తమకు ఎంతగానో ఉపయోగపడిందని అని తెలియజేశారు.

మైనర్ల డ్రైవింగ్తో భయానికి గురవుతున్న ప్రజలు

చిన్నారులకు వాహనాలు ఇస్తున్న తల్లి తండ్రులు - ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు ?

పోలీసులు ఎంత చెప్పిన ఆగని మైనర్ల డ్రైవింగ్

విశాలాంధ్ర - రాజాం : రోడ్లపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. డ్రైవింగ్లో నిబంధనలు పాటించకపోవడం, వేగం గా వెళ్లడం, త్రిబుల్ డ్రైవింగ్ చెయ్యడం తో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలా ప్రమాదాలు జరుగుతున్న సమయంలో ప్రమాద భీమా ద్వారా గాయ పడిన, మృతి చెందిన కుటుంబాలకు, దెబ్బ తిన్న వాహనాలకు డబ్బులు వస్తాయి. ఇవి అన్ని మేజర్ లు డ్రైవింగ్ చేస్తే జరుగుతుంది. ఇక మైనర్లు డ్రైవింగ్ చేసిన సమయంలో ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు అని ప్రశ్న వినిపిస్తుంది. మైనర్ డ్రైవింగ్ చేసిన సమయంలో ప్రమాదం జరిగితే ప్రమాద భీమా రాదు. దెబ్బ తిన్న వాహనాలకు నష్ట పరిహారం రాదు. గాయపడిన వారికి వైద్య ఖర్చులు ఇవ్వరు, ఏ కుటుంబ యజమాని అయినా మృతి చెందితే ఆ కుటుంబం పరిహారం రాకపోతే రోడ్డు పడవలసిన పరిస్థితి ఉంది. దీనికి తోడు డ్రైవింగ్ చేస్తున్న మైనర్లకు ఏమైనా జరిగినట్లయితే, ప్రమాదంలో చిన్నారులు జరగరానిది జరిగితే వారి తల్లి తండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతారు. ఎందుకు అంటే చిన్నారుల డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ విషయాలు తెలిసి కూడా తల్లి తండ్రులు వారి పిల్లలకు వాహనాలు ఇస్తున్నారు. పోలీసులు పైతం పిల్లలకు వాహనాలు ఇవ్వద్దు అని చెప్పినా మళ్లీ వాహనాలు ఇస్తున్నారు. వీరికి డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వరు. వేగంగా వెళతారు. ముగ్గురు వెళుతుంటారు. వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయాలు ఆలోచించి ఇప్పటికి అయినా తల్లి తండ్రులు వారి పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు అని చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పలువురు సూచనలు చేశారు.